క్లుప్తంగా

కాల్వల్లో పారుదల జరిగేలా చూడండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వల్లో పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మారీసుపేట, శాంతినగర్, పినపాడు ప్రాంతాలలో బుధవారం ఆయన పర్యటించారు. ఆప్రాంతాలలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించారు. చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరించాలని సూచించారు. రోడ్లపై చెత్త ఉండకుండా చూడాలన్నారు. అనంతరం 28వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన సర్వేలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

అన్నమాచార్య ఆరాధనా ఉత్సవాలు



తెనాలి: పదకవితా పితామహుడు శ్రీతాళ్లపాక అన్నమాచార్య 522వ ఆరాధన ఉత్సవాలు బుధవారం తెనాలిలో ఘనంగా జరిగాయి. పట్టణానికి చెందిన సంగీత సంస్థ శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో సాయంత్రం అయిదు గంటల నుంచి ఈ వేడుకలను నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఎంపిక చేసిన సప్తగిరి సంకీర్తనలను 120 మంది గాయకులు సామూహిక సంకీర్తన చేశారు. తదుపరి కీర్తనలు వచ్చిన ప్రతివారూ ఒక్కో సంకీర్తనను గానం చేసి అన్నమయ్యకు సమర్పించారు. గానం చేసిన వారిలో పంచాంగం రామానుజ స్వామి, కృత్తివెంటి కమల, కొండపి వసుంధర, నందిరాజు నాగప్రసన్న, నేరెళ్ల కళ్యాణి, మూర్తి అనురాధ, మూర్తి పద్మావతి, కొలిశెట్టి బాలాత్రిపురసుందరి, మాదల సత్యకుమారి, కటకం అన్నపూర్ణ, గౌరవరుపుల ఆంజనేయశాస్త్రి, డాక్టర్ కె.పురుషోత్తమరావు, టీవీఎస్ శాస్త్రి, వీఎల్ నరసింహారావు, శంకర్ రాజు, బి.సుబ్బారావు, 'కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు', 'బ్రహ్మ కడిగిన పాదము', 'ముద్దుగారే యశోద', 'పొడగంటిమయ్యామిమ్ము పురుషోత్తమా', 'భావములోనా బాహ్యమునందు గోవింద గోవింద అని కొలువవే మనసా' అనే కీర్తనలను ఆలపించారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఫ్లెక్సీ రహిత తెనాలిలో భాగస్వామ్యులు కావాలి

తెనాలిఅర్బన్: ఫ్లెక్సీ రహిత తెనాలి రూపకల్పనలో వ్యాపారులు, రాజకీయ పార్టీల నాయకులు, విద్యాసంస్థల నిర్వాహకులు, ప్రజలు భాగసామ్యులు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణంలో అనేక మంది అనధికారికంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వాటిని వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. లేని పక్షంలో టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు వాటిని తొలగించటం జరుగుతుందన్నారు. ఇవి పట్టణ సుందరీకరణకు, ట్రాఫిక్‌కు తీవ్ర అవరోధంగా మారుతున్నట్లు చెప్పారు.

పశువులకు టీకాలు

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు సుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ బుధవారం తెలిపారు. ఇప్పటివరకు గ్రామంలో 200 గేదెలకు, 12 ఎద్దులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏపీవోగా కిరణ్మయి బాధ్యతల స్వీకరణ

ఫిరంగిపురం: ఉపాధి హామీ పథకం మండల ఏపీవోగా ఎంకే కిరణ్మయి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మేడికొండూరు మండల ఏపీవోగా, తాడికొండ ఇన్‌చార్జిగా ఆమె బాధ్యతలు నిర్వర్తించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఫిరంగిపురం వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలయ్యేలా చూస్తానన్నారు. పశువుల పాకల నిర్మాణం, కంపోస్టు గుంటలు ఏర్పాటు వంటికి రైతులకు వివరించనున్నట్లు తెలిపారు.

నేడు ఆరోగ్య మిత్రల నిరసన

మంగళగిరి: రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవ ఆరోగ్యమిత్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గురువారం నిరసన చేపట్టనున్నారు. దీనిని విజయవంతం చేయాలని ఆరోగ్య మిత్ర రాష్ట్ర కమిటీ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. మంగళగిరి ఎన్ఆర్ఐ జంక్షన్‌లోని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ రాష్ట్ర కార్యాలయం ఎదుట గురువారం ఉదయం 11 గంటలకు నిరసన ఉంటుందని ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ప్రతినిధులు కోరారు.

భక్తిప్రపత్తుల మాసం రంజాన్

ప్రేమ, దానం, ధ్యానం సమ్మిళితమైన సందర్భం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

తెనాలిరూరల్: రంజాన్.. రంగురంగుల సేమ్యాలు, నోరూరించే ఇఫ్తార్ విందులు, గుప్పుమనే అత్తరు గుభాళింపులు.. ఇవన్నీ ఒక వైపు.. మోకాళ్లపై కూర్చుని చేసే నమాజులు, భక్తుడే దేవుడిగా మారి చేసే దానాలు, గుండెల నిండా అల్లాహ్‌ను నింపుకుని పచ్చినీరైనా ముట్టకుండా చేసే ఉపవాసాలు.. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో.. ఈ నెల పాటు దేవుడి ముందు కూర్చున్న పసిబిడ్డల్లా ప్రసన్నంగా కనిపిస్తారు. పవిత్ర మాసంలో భక్తులంతా దూవుడి ప్రతినిధులుగానే కనపిస్తారు. ధ్యానం, దానం, ప్రేమ సమ్మిళితంగా నెల రోజులు గడుపుతారు.

రంజాన్.. ప్రతి ముస్లింకు అత్యంత ప్రీతికరమైన, పవిత్రమైన మాసం. ఈ నెల రోజుల పాటు ఉపవాస దీక్షలతో పాటు ఐదు ముఖ్య విధులు నిర్వహించాల్సి ఉంది. ప్రతిరోజు ఐదు పూటలు నమాజు చేయడం, కఠిన ఉపవాసం ఉండడం, తాను సంపాదించిన దాంట్లో కొంత భాగం దానం చేయడం (ఫిత్రా) వంటివి తప్పనిసరి.

మిస్వక్ (దంత ధావనం)

ఈ మాసంలో ఉదయం లేవగానే ముస్లిం సోదరులు దంత ధావనం కోసం ప్రత్యేక పుల్లను వాడతారు. పరగోగు చెట్టు ముక్కలను ఇందుకు వినియోగిస్తారు. రంజాన్ నెలలో దంత ధావనానికి వీటిని ఉపయోగిస్తారు. వీటిని వాడడం వల్ల ఆరోగ్యంతో పాటుగా ఉదయం నుంచి ఉపవాసం చేసే వాళ్లకి ఎంతో ఉపకరిస్తుంది. ఆరోగ్య సంరక్షణ కూడా సాధ్యమని మత పెద్దల విశ్వాసం.

సెంట్లు, అత్తర్లు..

ప్రవక్త ఆజ్ఞానుసారం రంజాన్ నెలలో సువాసనలు వెదజల్లే అత్తర్లు కొనుగోలు చేయడం పరిపాటి. దేశ విదేశాలకు చెందినవి ప్రస్తుతం పట్టణంలోనూ లభ్యమవుతున్నాయి. వీటి ధర రూ. 40 నుంచి వివిధ సైజుల్లో, ధరల్లో లభ్యమవుతాయి.

జానీమాజ్..

ఇంట్లో అల్లాను ప్రార్థించే వేళ నేల మీద కాకుండ జానీమాజ్ అనే పరదా మీద కూర్చోవాలన్నది నిబంధన. ఇవి కూడా ఆధునిక డిజైన్లలో లభిస్తున్నాయి. మసీదుకు రాని మహిళలు ఇంట్లో నమాజు చేసుకునేందుకు ఎక్కువగా వీటిని వాడుతుంటారు.

నమాజు టోపీలు..

అల్లాహ్‌ను ప్రార్థించే సమయంలో ప్రతి ముస్లిం సోదరుడు తలపై టోపీని ధరించడం తప్పనిసరి. కాలానుగుణంగా రంగురంగుల, పలు రకాల డిజైన్లలో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్నవీ లభ్యమవుతున్నాయి. ఈ టోపీలు ధరించిన తర్వాతే మసీదుల్లోకి వెళతారు.

సహర్‌లో డ్రైఫ్రూట్స్..

తెల్లవారు జామున సహర్‌లో తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా డ్రై ఫ్రూట్స్(ఎండు ఫలాలు), పాలు, మాంసం, గోధుమ రొట్టెలు తీసుకుంటారు. కేవలం సాధారణ ఆహారం, రొట్టెలు తీసుకుంటే వాటి ప్రభావం కొన్ని గంటలు మాత్రమే ఉంటుంది.

12 గంటల పాటు ఆహారం, నీళ్లు తీసుకోకుండా ఉండాలంటే డ్రై ఫ్రూట్స్‌కు ప్రాధాన్యం ఉంటుంది. ఖర్జూరాలను ప్రత్యేకంగా అరబ్ దేశాల నుంచి తెప్పించి అమ్ముతారు.

సేమ్యా రుచే వేరు..

రంజాన మాసంలో ముస్లింలు సాయంత్రం వేళలో హలీమ్‌ను ఎక్కువగా తీసుకుంటారు. ఇటీవలి కాలంలో ఈ ఆహారం మన ప్రాంతంలో అందుబాటులోకి వచ్చింది. దీని స్థానంలో సేమ్యాను ఎక్కువగా వాడతారు. మసీదుల్లో దీంతో పాటుగా గంజి రూపంలో ఉండే పిండి పదార్థాన్ని తయారు చేస్తారు. రవ్వ, కరివేపాకు, టమాటా, కొత్తిమీర, క్యారెట్‌తో పెద్ద పాత్రలో ఉడికించి, బూందీ వేసి ఆరగిస్తారు.

తెనాలి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక నేడు

వైఎస్సార్‌సీపీకి కైవసం కానున్న కోఆప్షన్



బి. ఉదయ కుమార్, ఎన్నికల అధికారి

తెనాలిటౌన్: తెనాలి మండల ప్రజా పరిషత్ కో ఆప్షన్ సభ్యుని ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల అధికారి బి.ఉదయ కుమార్ బుధవారం తెనాలి వచ్చారు.కొత్తపేటలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికకు అవసరమైన ఏర్పాట్లు పరిశీలించారు.

తెనాలి మండల ప్రజా పరిషత్ పరిధిలో 21 ఎంపీటీసీలు ఉన్నాయి. వీటిలో వైఎస్సార్‌సీపీకి–18, టీడీపీ–1, జనసేన–ఇద్దరు సభ్యులున్నారు. ఎన్నికల అనంతరం మొదటి విడత ఎంపీపీగా గుడివాడ ఎంపీటీసీ సభ్యులు చెన్నుబోయిన శ్రీనివాసరావును అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఎంపిక చేశారు. ఆయన రెండున్నర సంవత్సరాల తర్వాత ఇచ్చిన మాట ప్రకారం కంచర్లపాలెం ఎంపీటీసీ ధర్మరాజుల చెన్నకేశవులును ఎంపీపీగా ఎన్నుకున్నారు. అప్పటి నుంచి ఆయన ఎంపీపీగా వ్యవహరిస్తున్నారు. నూతన పాలక మండలి ఏర్పడిన సమయంలో కో ఆప్షన్ సభ్యునిగా తేలప్రోలుకు చెందిన షేక్ గాలబ్‌ను ఎన్నుకున్నారు. ఆయన వ్యక్తిగత కారణాల వల్ల 2024 జనవరి 22న తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి పోస్ట్ ఖాళీగా ఉంటువచ్చింది.

నేడే కో అప్షన్ ఎన్నిక

మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ పదవీ ఖాళీగా ఉండటంతో ఎన్నికల కమిషన్ దానికి ఎన్నిక నిర్వహించాలని ఆదేశించింది. దీనిలో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు నామినేషన్ స్వీకరణ, 12 గంటలకు దరఖాస్తుల పరిశీలన, 1 గంటకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని ఎన్నికల అధికారి బి ఉదయ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 22న తేలప్రోలు గ్రామానికి చెందిన షేక్ గాలబ్ వ్యక్తి గత కారణాల వల్ల కోఆప్షన్ పదవికి రాజీనామా చేయటంతో ఆ పదవి ఖాళీ అయిందన్నారు. దానిని భర్తీ చేసేందుకు అధికారులు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీన సభ్యులందరికీ ఫారం –2 నోటీసులు పంపించడం జరిగిందని వివరించారు. నేడు ఎన్నికల నియామావళి ప్రకారం కనీసం 50 శాతం సభ్యులు హాజరు కావాలన్నారు. 21 ఎంపీటీసీ సభ్యులలో 11 మంది సభ్యులు హాజరైతే ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకొనున్న కో ఆప్షన్ మెంబరు

గురువారం జరిగే మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుని పదవి వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోనున్నది. మండల పరిషత్ పరిధిలోని మొత్తం 21 మంది సభ్యులలో 18 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ఉన్నారు. అంటే ఎక్కువ మెజార్టీ వైఎస్సార్‌సీపీకి ఉండటంతో ఎన్నిక లాంఛనం కానుంది. వైఎస్సార్ సీపీ అధిష్టానం తేల ప్రోలు గ్రామానికి చెందిన సయ్యద్ జానీ బాషాను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నట్లు తెలిసింది.

పన్నులపై వడ్డీ రాయితీని ఉపయోగించుకోండి

- తెనాలి పట్టణంలో నేటి నుంచి నాలుగు చోట్ల పన్నుల చెల్లింపుల కేంద్రాలు ఏర్పాటు
- మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఇంటి, ఖాళీ స్థలం, నీటి పన్నులపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీని ప్రకటించిందని, పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదిలోపు ఒకేసారి పన్నులు చెల్లిస్తేనే ప్రభుత్వం ఇచ్చిన రాయితీ లభిస్తుందన్నారు. తెనాలి పట్టణంలో 37,410 నివాస గృహాలున్నాయని తెలిపారు. వాటి ద్వారా పురపాలక సంఘానికి రూ.19.17 కోట్ల ఆదాయం లభిస్తుందన్నారు. ఈఏడాది ఇప్పటి వరకు 30 వేల నివాస గృహాలు యజమానులు రూ.15.25 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన రూ. నాలుగు కోట్ల వసూలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు 77 శాతం పన్నులు వసూలు చేయటం జరిగిందన్నారు. గతేడాదితో పోల్చుకుంటే 21 శాతం అదనంగా వసూలు చేసినట్లు వివరించారు. గురువారం నుంచి తెనాలి పట్టణంలోని చెంచుపేట, స్వరాజ్ టాకీస్ సెంటర్, శివాజీ చౌక్, లక్ష్మి థియేటర్ సెంటర్‌లో పన్నుల చెల్లింపు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇవి సోమవారం వరకు ఉంటాయని, సెలవు రోజులలో కూడా పనిచేస్తాయని చెప్పారు. మున్సిపల్ రెవిన్యూ అధికారి రాంప్రసాద్ మాట్లాడుతూ పన్నులను మున్సిపల్ కార్యాలయంలో, వార్డు సచివాలయాలలో, ఆన్‌లైన్‌లో, ప్రత్యేక పన్నుల చెల్లింపు కేంద్రాలలో చెల్లించవచ్చని తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమాలకు వాటర్ ప్యూరిఫైయర్లు



వాటర్ ప్యూరిఫైయరును ప్రారంభించిన డాక్టర్ రామ్‌చంద్

తెనాలి: మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ, తెనాలి ఆధ్వర్యంలో బుధవారం పట్టణ చెంచుపేటలోని శబరి వృద్ధాలయం, ఏల్చూరి అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి వేర్వేరుగా రెండు 10 లీటర్ల వాటర్ ప్యూరిఫైయర్లను బహూకరించారు. సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ వీటిని ప్రారంభించి, వృద్ధులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించారు. సమాజంలో మానవతావాదాన్ని, మానవతా దృక్కోణాన్ని పెంపుదల చేయాలన్నదే మానవత లక్ష్యంగా చెప్పారు. రకరకాల విభాగాల్లో సేవకు ఎక్కడైతే అవకాశం ఉన్నదో? అక్కడ తాము చేయూతనిస్తున్నట్టు తెలిపారు. ఆ క్రమంలో పట్టణానికి చెందిన స్వాతంత్ర్యయోధులు కొల్లా కనకవల్లీ తాయారమ్మ, కాశీవిశ్వనాథం దంపతులు 1932లో ప్రారంభించిన శబరి వృద్ధాలయంలోనూ సేవలకు అవకాశం అదృష్టమన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్ మాట్లాడుతూ తెనాలి శాఖ వృద్ధుల సేవలో తీసుకుంటున్న చొరవను రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రశంసించారని, ఆ వివరాలను రాష్ట్రంలోని అన్ని శాఖలకు పంపుతామని చెప్పటం సంతోషంగా ఉందన్నారు. తొలుత అక్కడి కనకవల్లీ తాయారమ్మ, కాశీవిశ్వనాథం విగ్రహాలకు పూలమాలలు వేశారు. శబరి వృద్ధాలయం నిర్వాహకుడు కొల్లా ధర్మకుమార్ మానవత బాధ్యులను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, కమిటీ సభ్యులు కె.నాగేశ్వరరావు, ఎం.అర్జునరావు, సీహెచ్ సాంబశివరావు, పి.మల్లికార్జునరావు, ఎం.శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 29న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం తెలిపారు. శనివారం ఉదయం 11.00 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

తెనాలి జిల్లా వైద్యశాలలో ఆభరణాలు మాయం

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

తెనాలిరూరల్: తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణీ ఆభరణాలు మాయమయ్యాయి. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి. కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన గర్భిణీ కాన్పు కోసం తెనాలి జిల్లా వైద్యశాలలో మూడు రోజుల క్రితం చేరగా వైద్యులు కాన్పు చేశారు. గర్భిణీ ఆభరణాలు ఆమె తల్లి వద్ద ఉన్నాయి. మంగళవారం రాత్రి తల్లి స్నానాల గదికి వెళ్లి ఆభరణాలను అక్కడే మర్చిపోయి వచ్చింది. కొద్ది సేపటికి గుర్తు వచ్చి వెళ్లి చూడగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులను బుధవారం ఆశ్రయించారు. త్రీ టౌన్ పోలీసులు వైద్యశాల ఆవరణలోని తల్లిపిల్లల వైద్యశాలను పరిశీలించారు. సీసీ కెమెరాల పుటేజ్ పరిశీలించేందుకు టెక్నీషియన్ గురువారం వస్తాడని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

దేవస్థాన భూముల్లో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- అక్రమార్జనే లక్ష్యంగా టీడీపీ నాయకులు మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు



శిరిపూడిలో జేసీబీతో మట్టిని ట్రాక్టర్ ట్రక్కులో వేస్తున్న దృశ్యం

నగరం: నగరంలో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. అక్రమార్జనే లక్ష్యంగా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా అక్రమంగా మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు. చెరుకుపల్లిలోని చెన్నకేశవ స్వామి దేవస్థానంకు చెందిన భూములు మండలంలోని శిరిపూడి గ్రామంలో ఉన్నాయి. ఈ భూముల్లో టీడీపీ నేతలు అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమార్కులు తమ ఇష్టానుసారం మట్టిని తరలించుకుపోతున్నారు. పట్టపగలు దేవస్థానం భూముల్లో మట్టిని జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటే అధికారుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దేవదాయ శాఖకు చెందిన భూముల్లో టీడీపీ నాయకులు అక్రమ తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టీపట్లనట్లు వ్యవహరిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవస్థాన భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు నిలిపివేయాలని కోరుతున్నారు.

పార్టీని బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు

తెనాలిటౌన్: బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు పిలుపునిచ్చారు. బుధవారం మారీసుపేటలో పార్టీ నాయకుడు యర్రంరాజు సందీప్ అధ్యక్షతను సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మోడీ నాయకత్వంలోని పార్టీని ప్రజలలోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రానున్న రోజుల్లో గ్రామ, పట్టణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. అందరు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో కఠారి వాసుదేవ నాయుడు, టి అనంతాచార్యులు, సి.హెచ్.విజయభాస్కరరెడ్డి, కుమార్ గౌడ్, మైలా హరికృష్ణ, బిట్రా కనకదుర్గా, సింగంరాజు కనకదుర్గా, లీలా ఫణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జకాత్ దాన ప్రధాన'లో రూ.3 లక్షల ఆర్థికసాయం



సాయం అందించిన విద్యార్థులతో షేక్ ఖలీల్

తెనాలి: ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందించటం అవసరమని, ఆ దిశగా దీర్ఘకాలంగా కృషి చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులని కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు అన్నారు. పట్టణ చినరావూరుకు చెందిన జాఫర్ సాదిక్ బాష ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కొత్తపేటలోని డీఎల్ కాంతారావు కళావేదికలో సేవాక్రమం నిర్వహించారు. 'జకాత్ దాన ప్రధాన' కార్యక్రమం కింద 24 మంది పేద విద్యార్థులు, 18 మంది పేదలకు వైద్యం నిమిత్తం మొత్తం 3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సభకు ట్రస్ట్ అధ్యక్షుడు షేక్ ఖలీల్ అధ్యక్షత వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 18 ఏళ్లగా పేదవిద్యార్థులకు, రోగులకు ఆర్థికసాయం, పేద కుటుంబాలకు వనరుల పంపిణీని కొనసాగిస్తున్నట్టు ఖలీల్ చెప్పారు. వివేక విద్యాసంస్థల చైర్మన్ రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ, సమాజంలో సహాయం అవసరమైన వారిని గుర్తించి, అందించే సాయం సద్వినియోగం అవుతుందని చెప్పారు. ఆ క్రమంలో జాఫర్ సాదిక్ బాష ట్రస్ట్ చేస్తున్న సమాజసేవ చక్కని ఫలాలను ఇస్తుందన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. సమావేశంలో కటారి వాసుదేవ నాయుడు, శ్రీనివాసరావు, అబ్దుల్ రవూఫ్, షబ్బీర్ బాష, దావూద్, కరిముల్లా, గౌసియాబేగం, నఫీజ్, జిల్లు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మిఠాయిలు పంపిణీ

రేపల్లె రూరల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ సెల్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు నసీరున్నీసా–డాక్టర్ అతిక్ దంపతుల సౌజన్యంతో రేపల్లె పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మసీదులకు మిఠాయిలు పంపిణీ చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కర్రేటి శేషగిరిరావు, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట కృష్ణారెడ్డి, నాయకులు పట్టెం శ్రీనివాసరావు, చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, కర్రా రత్నాకర్, నీలా నాంచారయ్య, అబ్దుల్ ఖుద్దూస్, లియాకత్ బాషా, గౌస్, కర్రా రత్నాక్, బాజీ, బాషా, ఫణి, శేషు, శివ, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

28న రుణ అర్హత మేళా

తాడికొండ: ఈ నెల 28న తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో భారీ రుణ అర్హత మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సమతావాణి తెలిపారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రుణ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 28వ తేదీ ఉదయం 10 గంటలకు అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు పత్రంతోపాటు, ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుని బ్యాంకు మేనేజర్ల సమక్షంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు.

చెత్త కుప్పలు వీడి.. చదువులమ్మ బడిలోకి చేరి..

సాక్షి ఎఫెక్ట్



తెనాలిటౌన్: కొలకలూరు వంతెన సమీపంలోని పేద చిన్నారులు చదువుకు దూరమై వ్యర్థాలలో గడుపుతున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో బాల్యం ఛిద్రం... వ్యర్థం అనే శీర్షికన బుధవారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించి తెనాలి మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబులు చిన్నారుల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారిని బడికి దూరం చేయవద్దని సూచించారు. వారి అనుమతితో ప్రభుత్వ పాఠశాలలో గురువారం చేర్పించారు. విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పలువురు పలువరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) షేక్ అబ్దుల్ షరీఫ్



మాట్లాడుతున్న న్యాయమూర్తి అబ్దుల్‌షరీఫ్

తెనాలిరూరల్: బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో యాక్టు)పై అందరూ అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) షేక్ అబ్దుల్ షరీఫ్ సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొల్లిపర మండల ఎంపీడీవో కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సస్సును బుధవారం సాయంత్రం నిర్వహించారు. న్యాయమూర్తి అబ్దుల్ షరీఫ్ మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడినా, ప్రేరేపించే పనులు చేసినా, అసభ్యంగా ప్రవర్తించినా, తాకినా పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులను నిరోధించేందుకు 2012లో ఈ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ చట్టం 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందని, వారిపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్షలతో పాటు మరణశిక్ష కూడా విధిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజరలక్ష్మి, ఎస్ఐ పి. కోటేశ్వరరావు, కోఆర్డినేటర్ యర్రంశెట్టి అనిల్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెనాలి పండితుడికి 'ఆగమ ధ్యుమణి' బిరుదు ప్రదానం



శ్రీమాన్ దీవి లక్ష్మీ నరసింహచార్యులుకు సత్కారం

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటకు చెందిన ప్రముఖ ఆగమశాస్త్ర పండితుడు, ఆధ్యాత్మిక ప్రచారకర్త, తెలుగు సంస్కృతం, ఇంగ్లిష్, హిందీ, కన్నడ భాషల పండితుడు శ్రీమాన్ దీవి లక్ష్మీ నరసింహచార్యులుకు తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం 'ఆగమ ధ్యుమణి' బిరుదును ప్రదానం చేసింది. తిరుపతిలో మంగళవారం రాత్రి జరిగిన వార్షికోత్సవ సభలో ఆయనకు బిరుదను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ డాక్టర్ శ్రీమాన్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఎన్.రాఘవేంద్ర, విద్యాపీఠం డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, వైస్‌ఛాన్సలర్ గొల్లపల్లి శ్రీరామకృష్ణమూర్తి, ప్రొఫెసర్ సి.రంగనాధన్, ప్రొఫెసర్ ఎస్.దక్షిణామూర్తి, కో–ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ నాగరాజు, అడిషనల్ కో–ఆర్డినేటర్ ఉదయన్ హెగ్డే తదితరులు ఆచార్యులను సత్కరించినవారిలో ఉన్నారు. లక్ష్మీనరసింహాచార్యులు పాండితీగరిమను, ఆయన సమాజానికి అందిస్తున్న ఆధ్యాత్మిక సేవను వక్తలు ప్రశంసించారు. శ్రీవైఖానస సేవాసంఘం, శ్రీవిఖనస శ్రీనివాసట్రస్ట్, యువ వైఖానస అసోసియేట్స్, తెనాలి రాష్ట్ర అర్చక సేవాసంఘం, రాష్ట్ర అర్చక సమాఖ్య, వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య, వేమూరు మండల ఆర్యవైశ్య సంఘం, కొలకలూరు శ్రీ చెన్నకేశవ రాజ్యలక్ష్మి ఆలయ అభివృద్ధి ట్రస్ట్, తెనాలి బ్రాహ్మణ పరిషత్, కేఎల్ఎన్ సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, బ్రాహ్మణ సేవాసమితి ప్రతినిధులు బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.

రేపు కొల్లిపరలో క్రెడిట్ క్యాంపు

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపరలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన క్రెడిట్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులను ఈ క్యాంపులో ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల బ్యాంకు అధికారులు, సెలక్షన్ కమిటీ సభ్యులు పాల్గొని లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు ఈ క్యాంపుకు హాజరవ్వాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందన్నారు.